క్లుప్తంగా

తొలి పూజకు సర్వం సిద్ధం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

పాలకొండ: వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మంటపాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మంటపాలు ఏర్పాటు చేసే పనిలో యువత బిజీగా ఉండగా.. ముఖ్య కూడళ్లలో వినాయక విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉంటే తయారీదారులు పెద్ద పెద్ద విగ్రహాలు తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

జనసేన నేత అవినీతి బాగోతం బట్టబయలు!

- దివ్యాంగుల పింఛన్ల మంజూరుకు రూ.30 వేలు చొప్పున వసూలు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొమరాడ: జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తెంటు శ్రీకర్ అవినీతి బాగోతం బయటపడుతోందని, పింఛన్ల మంజూరుకు పలువురు దివ్యాంగుల నుంచి రూ.30 వేలు చొప్పున వసూలు చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు కళింగి మల్లేశ్వరరావు, నంగిరెడ్డి శరత్‌బాబు, మరడాన సింహాచలం ఆరోపించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. పింఛన్ల జారీలో అవినీతి అక్రమాలకు పాల్పడితే తాటతీస్తాం.. తొక్కి నారతీస్తామన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్..మీ పార్టీ వారే అవినీతికి పాల్పడుతుంటే ఏం చేస్తున్నావని ప్రశ్నించారు. సదరు నాయకుడికి కొంతమంది బంగారం పుస్తెలతాడులు తాకట్టు పెట్టి మరీ సదరం సర్టిఫికెట్ కోసం డబ్బులు ఇచ్చినట్లు ఆడియో రికార్డు బయటకు రావడం ఆయన అవినీతికి అద్దం పడుతోందని విమర్శించారు. కూటమి నాయకులే పింఛన్లు తొలగించడం, వారే మళ్లీ పింఛన్ల కోసం ఇలా డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమని, ప్రజలంతా దీనిని గమనిస్తున్నారన్నారు. ఇలాంటి అవినీతిపరులైన నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మరడాన సూరపునాయుడు, కెంగువ పోలినాయుడు, సిరిపురం రామకృష్ణ, గుల్లిపిల్లి చిన్నసుధ, సింహాచలం పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ర్యాలీ

సీతంపేట: మండల కేంద్రంలోని స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ర్యాలీ శనివారం నిర్వహించారు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, ఏపీఓ చిన్నబాబు, ఎంపీడీఓ సత్యం, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

వీరఘట్టం: ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎంపికైన వీరఘట్టం మండలం బిటివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రత్నాకరరావును శనివారం స్థానిక హైస్కూల్ ఆవరణలో సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రత్నాకరరావు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నేత్ర వైద్య తనిఖీలు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో శిబిరానికి హాజరైన వారికి నేత్ర వైద్య తనిఖీలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి రోగులకు తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యుడు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గరుగుబిల్లి/జియ్యమ్మవలస రూరల్/జియ్యమ్మవలస: మండలాల్లోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. గరుగుబిల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపీడీవో పైడితల్లి..జియ్యమ్మవలస మండలంలోని చింతలబెలగాం, బిత్రపాడు గ్రామాల్లో ఎంపీడీవో కె.ధర్మారావు, పంచాయతీ ప్రత్యేకాధికారి కొండలరావులు పాల్గొని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలి

జియ్యమ్మవలస రూరల్: అన్ని గ్రామాల్లోని ప్రజలు వినాయక చవితి పండగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని తహసీల్దారు వై.జయలక్ష్మి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని గెడ్డతిరువాడ, ఇటిక, బీజేపురం, తురకనాయుడువలస గ్రామాల యువతకు బైండోవర్ కేసులపై అవగాహన కల్పించారు.

బినామీ మస్తర్లకు చెక్!

- వేతనదారులకు ముఖ ఆధారిత హాజరు
- రోజుకు రెండుసార్లు ఫొటో తీయాల్సిందే..
- బోగస్ మస్తర్లు లేకుండా కేంద్రం చర్యలు


ఉపాధి పనుల్లో నిమగ్నమైన వేతనదారులు(ఫైల్)

గరుగుబిల్లి:

ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో పనులు జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఉపాధి ఫలాలను అర్హులకు అందించాలనే సంకల్పంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎస్‌ఎస్) పేరుతో నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రారంభిస్తోంది. దీంతో బినామీ, బోగస్ మస్తర్లతో ఉపాధి నిధుల స్వాహాకు చెక్ పడనుంది. ఉపాధిహామి పథకంలో బోగస్, బినామీ మస్తర్లతో క్షేత్రసహాయకులు, నాయకులు పెద్దఎత్తున నిధులు స్వాహా చేస్తుండడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో ఎన్‌ఎంఎస్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను గ్రామ, మండల, జిల్లా భౌగోళిక పరిస్థితిని సైతం అంచనా వేసేలా రూపొందించారు. ఇందులో గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే జాబ్‌కార్డు కలిగిన వేతనదారుల ఫొటోలను ముందస్తుగా అప్‌లోడ్ చేస్తారు. ఉపాధి పనులకు వేతనదారులు హాజరైన సమయంలో యాప్ ద్వారా ప్రతి ఒక్కరి ఫొటో తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ ప్రక్రియలో ఒకరి బదులు మరొకరు పనులకు రాకుండా ఉండేలా తోడ్పడుతుంది.

కేంద్రం ఆదేశాలతో..

కురుపాం నియోజకవర్గంలో కురుపాం, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో 23,724 జాబ్‌కార్డులు ఉండగా, వీటి పరిధిలో 38,861 మంది ఉపాధి వేతనదారులు ఉన్నారు. ఇందులో 31 వేల మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎన్‌ఎంఎస్‌ఎస్ యాప్ ద్వారా పనులు చేపడుతున్నారు. ఏపీవోలు పనులు జరిగే ప్రాంతాల్లోని వేతనదారులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలి.

హాజరు నమోదు ఇలా..

ఉపాధి వేతనదారులు హాజరు తీసుకునేలా వేతనదారుల ఫొటోలను మొబైల్ ద్వారా తీసుకొని ఎన్‌ఎంఎస్‌ఎస్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రోజుకు రెండు సార్లు క్షేత్ర సహాయకులు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సమయంలో ఒకరికి బదులు మరొకరు హాజరు చూపితే ఆన్‌లైన్‌లో వేతనదారుల హాజరు తీసుకోదు.

నగదు చెల్లింపులు ఉండవు..

ఉపాధి పనులకు వేతనదారులు హాజరైన సమయంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే నాలుగు గంటల తర్వాత అంటే ఉదయం 10 గంటలకు మరోసారి ఫొటోను అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఉదయం 6 గంటలకు తీసిన ఫొటోతో పాటు 10 గంటలకు తీసిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అలా చేయకపోతే ఆరోజు వేతనదారులకు నగదు చెల్లింపులు ఉండవు. గతంలో వేతనదారులు పనులకు రాకపోయినా మస్తరు వేయడం, తమ బంధువుల పేర్లు నమోదు చేసి వారు పనులకు హాజరు కాకపోయిన నగదు తీసుకుంటూ దోచుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ కొత్త యాప్ ద్వారా వాటిని నిలువరించే అవకాశం ఉంటుంది. ఈ యాప్ ద్వారా అటు నాయకులు, ఇటు క్షేత్ర సహాయకులు అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

కురుపాం నియోజకవర్గంలో వేతనదారులు..		
మండలం	జాబ్‌కార్డులు	వేతనదారులు
గరుగుబిల్లి	5,135	7,952
కురుపాం	4,242	7,262
గుమ్మలక్ష్మీపురం	4,062	6,683
జియ్యమ్మవలస	5,089	8,643
కొమరాడ	5,196	8,321

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం వేతనదారులకు కొత్త యాప్ విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్నాం. రోజుకు రెండు సార్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. వేరే వాళ్లు పనిచేస్తే నగదు రాదు. క్షేత్ర సహాయకులు బాధ్యతగా పనిచేయడంతో పాటు రెండుసార్లు తీసిన ఫొటోలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

–ఎం.గౌరీనాథ్, ఏపీవో, గరుగుబిల్లి

పరిశుభ్రతపై దృష్టి సారించాలి


కోర్టు పరిసరాలను శుభ్రపరుస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు, సిబ్బంది

పాలకొండ రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని న్యాయమూర్తి సీహెచ్ హరిప్రియ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, డిపో పరిసరాల్లో పేరకుపోయిన వ్యర్థాలను డిపో సహాయ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రం చేశారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న సీఐ హరి, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే ద్విచక్ర వాహనదారులను ఆపి, వారి లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలు పరిశీలించారు. హెల్మెట్ ధరించని వారికి అపరాద రుసుం విధించారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: రైతులకు ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని విజిలెన్స్ అధికారులు ఎన్.శేఖర్(తహసీల్దార్), పి.శంకరరావు(ఏవో), బి.శివప్రసాద్(ఎస్‌ఐ)హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల షాపులను శనివారం తనిఖీ చేశారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఎరువుల షాపు నిర్వహకుడు అయిన డీలర్ సంతకంతో పాటుగా రైతు సంతకం, ఇరువురి ఫోన్ నంబర్లతో కూడిన బిల్లు ఇవ్వాలన్నారు. ఎరువుల కవర్ చిరిగి ఉండగా లేదా కాలం చెల్లిన ఎరువులను రైతులకు ఇవ్వరాదని, యూరియా, డీఏపీలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘనంగా నివాళులు


టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, అధ్యాపక బృందం అంతా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. చిన్నతనంలో ఎన్నో కష్టాలు చూసిన ఆయన ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. సైమన్ కమిషన్ భారత్‌కు వస్తే మద్రాసులో సైమన్ గో బ్యాక్ అని నినాదాలు చేసి దేశభక్తి చాటుకున్నారన్నారు. దేశభక్తిలో టంగుటూరి ప్రకాశం పంతులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 2023 ఆగస్టు 23న ప్రయోగించిన చంద్రయాన్ – 3 విజయవంతం కావడంతో ఆ రోజున నేషనల్ స్పేస్ డే జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

కురుపాం: ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, ఇప్పటికే వెంచర్లు వేసి వ్యాపారం చేస్తున్నారన్నారు. రావాడ రోడ్డు సమీపంలో టీకరఖండి రెవెన్యూలోనూ ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణలు చేశారన్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. లంకెల చెరువు కాలువను పూర్తిగా ఆక్రమించి మరుగుదొడ్లు నిర్మాణాలు చేపట్టారని దీనిపై అధికారులు తక్షణమే స్పందించి వాటిని తొలగించాలన్నారు. అనుమతి లేకుండా ప్రైవేటు క్లినిక్‌లను నిర్వహిస్తున్న వారిపై తూతూమంత్రంగా దర్యాప్తు చేశారని వాటిపై సమగ్రంగా ఉన్నత అధికారులే దర్యాప్తు చేపట్టాలన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం


దారపాడులో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మోహనరావు
- దారపాడు, పెద్దూరులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు

సీతంపేట: కూటమి పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు ఆరోపించారు. శుక్రవారం రాత్రి పెద్దూరులో.. శనివారం ఉదయం దారపాడు గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పాలనలో జరుగుతున్న మోసాలను వివరించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ ప్రజలకు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటివద్దే నిత్యావసర సరుకులు పంపిణీ చేయగా.. కూటమి ప్రభుత్వం సరుకుల కోసం డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, పార్టీ నాయకులు సవర సాయికుమార్, వెంకటరావు, సుందరరావు, సురేష్, ఎ.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

డీఈఈగా పదోన్నతి

కురుపాం: మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు పార్వతీపురం పీఐయూ డీఈఈగా పదోన్నతి వచ్చినట్లు ఆయనే స్వయంగా శనివారం తెలిపారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరిగే అన్ని అభివృద్ధి పనులను అందరి సహాయ సహకారాలతో చురుగ్గా జరిగేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పాడిరైతులకు శిక్షణ

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామంలో పాడిరైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. పశువులలో పునరుత్పత్తి సమస్యలు అధిగమించడం, అధిక పాలదిగుబడి, పశువ్యాధులపై అప్రమత్తం చేస్తూ వారికి సలహాలు, సూచనలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వారు అందజేశారు.

ఉత్సవ కమిటీలదే బాధ్యత..


గొల్లవీధిలో ప్రజలు, ఉత్సవ కమిటీతో సమావేశమైన సీఐ, తదితరులు

పాలకొండ రూరల్: వినాయక ఉత్సవాలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని సీఐ ఎం. చంద్రమౌళి స్పష్టం చేశారు. ఎస్సై కె.ప్రయోగమూర్తితో కలిసి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న వినాయక మంటపాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఉత్సవాలు నిర్వహించే వారు పోలీస్ అనుమతులు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు, ఇతరులకు ఇబ్బంది కలగకుండా మంటపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గత అనుభవాను దృష్టిలో పెట్టుకుని నిఘా మరింత పటిష్టం చేస్తామన్నారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు


పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన డీపీవో కొండలరావు

కురుపాం: పంచాయతీల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలని డీపీవో కొండలరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశమైన ఆయన..స్వమిత్వ సర్వేపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో కచ్చితమైన గ్రామ, ఇళ్ల సరిహద్దులు నమోదు చేయాలని, తద్వారా ఆస్తి తగాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వై.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ సూచించారు. మండలంలోని ఇరిడి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రీ స్కూల్ నిర్వహణపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా వారికి అందివ్వాల్సిన పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, సొంత భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు ఆమెను కోరారు. ఆమె వెంట భద్రగిరి పీవో విజయగౌరి, సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.


ఇరిడి అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: డిగ్రీలో ప్రవేశాలకు విద్యార్థులంతా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఓ ప్రకటనలో శనివారం కోరారు. నైపుణ్యం కలిగిన బోధనా సిబ్బంది, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారంతా డిగ్రీలో జాయిన్ కావాలన్నారు.

క్రీడలకు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో (ఎస్‌జీఎఫ్) భాగంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న క్రీడలకు సమాయత్తం కావాలని డిప్యూటీ డీఈఓ పర్రి కృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 కురిటి సోంబాబు, పీఈటీలు, పీడీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూడీ డీఈఓ మాట్లాడుతూ.. వచ్చే నెల 8 నుంచి 12 తేదీల మధ్యఅండర్ – 14, 17 బాలబాలికలతో స్థానిక హాట్కో కాలనీలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించాలన్నారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్, యోగా విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో హెచ్‌ఎం నాగభూషణరావు, వివిధ స్థాయిలకు చెందిన క్రీడా నిర్వాహకులు ఎం.రామకృష్ణ, ఎస్.వెంకటరమణ, ఆర్.రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో తొలగింపు పనులు


బంద్రసింగి ఘాట్ రోడ్డులో బండరాళ్లు తొలగిస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్...

భామిని: మండలంలోని బంద్రసింగి ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలను గిరిజన సంక్షేమాధికారి సింధూజ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. 'విరిగిన కొండచరియలు' శీర్షికన ఈనెల 21న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొండచరియలు విరిగిపడడం వల్ల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి రాళ్లను తొలగించడంతో ఆనందం వ్యక్తం చేశారు.


విరిగిపడిన కొండ చరియలు
బంద్రసింగి రోడ్డులో బండరాయి తొలగిస్తున్న

సాక్షిలో ప్రచురితమైన కథనం

ఘనంగా అంతరిక్ష దినోత్సవం


స్పేస్ ఈవెంట్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనలు, ఇతర కార్యక్రమాలపై ఉపాధ్యాయులు ముద్దులమ్మ, రోజాలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.